
సాక్షి
ప్రకాశం

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



పెద్దనల్లకాల్వపై డెంగీ పంజా

కంభం మండలం పెద్దనల్లకాల్వ గ్రామంలో సుమారు 50 మందికిపైగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు.

- 8లో..



భార్యను కట్టేసి చిత్రవధ

ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను కట్టేసి, తీవ్రంగా హింసించి చంపేందుకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు పొందగోరే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో కళాశాల లాగిన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరక్టర్ ఎన్ లక్ష్మానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ నుంచి పీజీ వరకూ విద్యనభ్యసిస్తున్న టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యార్థులను కళాశాలల ప్రిన్సిపల్స్ కళాశాల లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. నూతన, రెన్యువల్ ఉపకార వేతనాలు నమోదు చేయాలని చెప్పారు. ఈ నెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి 6 స్టెప్ వెరిఫికేషన్ కోసం సచివాలయాలకు పంపించాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థి ఉపకార వేతనం పొందకపోతే కళాశాలలను బాధ్యులను చేస్తామన్నారు.

జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక



జాతీయస్థాయి టార్గెట్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

సింగరాయకొండ: జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన మూడో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొని విజేతగా ఎంపికైన ప్రకాశం జిల్లా జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరచిన పాఠశాల విద్యార్థులు ఎం దిలీప్, డీ అక్షర, ఏ వర్షిణిలు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో అక్టోబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు పీ శ్రీనివాసరావు, ఎమ్‌డీ అన్వర్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో పీఆర్‌సీ కమిటీ వేయాలి

- ఏపీజీఏఈ ఆధ్వర్యంలో పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో ముఖాముఖి
- రండి టీ తాగుతూ మాట్లాడుకుందాంలో జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి

ఒంగోలు సబర్బన్: రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో పీఆర్‌సీ కమిటీని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' చర్చా కార్యక్రమం మంగళవారం పెళ్లూరు కాలనీలోని పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు ఉద్యోగులకు ఎలాంటి డిమాండ్లు తీర్చలేదన్నారు. తొలుత రాష్ట్ర అధ్యక్షుడు సూర్య నారాయణ సందేశం వీడియోను అధికారులు, సిబ్బందికి చూపించారు. కార్యక్రమంలో పే అండ్ అకౌంట్స్ శాఖ ఉద్యోగులు నరసింహారావు, రమేష్, వెంకటేశ్వరరావు, బాష, సురేష్, మల్లిక, రాజేశ్వరి, కల్పన, శోభ మాలిని, అనిత, మణి, నాగలక్ష్మి, తేజస్విని తదితరులతో పాటు ఒంగోలు పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పీసీపల్లి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

పీసీపల్లి: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకంలో భాగంగా మండల పరిధిలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ అజయ్ మిశ్రా, డాక్టర్ భార్గవి, డాక్టర్ చరిత పరిశీలించారు. ఇక్కడ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించి సుమారు 50 ఏళ్లైందని, వర్షానికి కారుతున్నాయని, శ్లాబ్ పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని పలు సమస్యలను డాక్టర్ యశివ్రత, డాక్టర్ మంజుల వారి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఇక్కడ క్వార్టర్స్ పూర్తిగా శిథిలమైపోయాయని నూతన క్వార్టర్స్ నిర్మిస్తే నర్సులు ఇక్కడే ఉండి సేవలు అందించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రోగులతో కూడా మాట్లాడారు. రాత్రి అయితే ఒక్క డాక్టర్ కూడా ఇక్కడ ఉండరని, చుట్టూ సుమారు 50 గ్రామాలు పైగా ఉన్నాయని ఏదైనా అత్యవసరమై ఆస్పత్రికి వస్తే, ప్రథమ చికిత్స చేసే వారే ఉండరని రోగులు తెలిపారు. ఉన్న ఇద్దరు డాక్టర్లు కూడా ఎవరో ఒకరే ప్రతిరోజు అందుబాటులో ఉంటారని, మరొకరు క్యాంపులను, మీటింగులకు వెళ్తుంటారని చెప్పారు. రాత్రి సమయంలో డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని రోగులు కోరారు.

నాణ్యత తరిగి.. ఆశలు కరిగి!

ఉప్పు రైతు బతుకు మాత్రం చప్పగా తయారైంది. తరతరాలుగా ఈ పంటనే నమ్ముకున్న వారి జీవితాలు కష్టాల కడలిలో కరిగిపోతున్నాయి. రెండేళ్లుగా ప్రతికూల పరిస్థితుల్లో సాగు భారంగా మారింది. పంట ఉంటే ధర ఉండదు. ధర ఉంటే దిగుబడి లేక రైతులు నష్టాలపాలవుతున్నారు. ప్రస్తుతం నెలకొని ఉన్న ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి భారీగా పడిపోయింది. ఎకరాకు 400 బస్తాల మేర దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా ధర ఉన్నా పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు దళారుల దోపిడీ వీరిపాలిట శాపంగా మారింది.



ఉప్పు కొఠారుల్లో తయారైన ఉప్పు

- ఆశ నిరాశల మధ్య ఉప్పు రైతులు
- ఉమ్మడి జిల్లాలో సుమారు 4 వేల ఎకరాల్లో సాగు
- వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి
- ధర ఉన్నా భారీగా పడిపోయిన దిగుబడి
- అడపా దడపా వర్షాలతో తగ్గిన నాణ్యమైన ఉప్పు దిగుబడి
- నాణ్యతను బట్టి 100 కేజీల ఉప్పు ధర రూ.310 నుంచి రూ.400
- ఈ సంవత్సరం కష్టాలు తప్పవంటున్న ఉప్పు రైతులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఐదు సంవత్సరాలుగా వాతావరణం అనుకూలించడం, మార్కెట్లో ఉప్పు ధరలు ఆశాజనకంగా ఉండటం, పక్క రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి నేరుగా కొనుగోలు చేయడంతో రైతులు లాభాలు చవిచూశారు. ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలోని చినగంజాం, కనపర్తి, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఉప్పు కొటారుల్లో సుమారు 4 వేల ఎకరాల్లో ఉప్పు సాగవుతోంది. 7 వేలకు పైగా రైతులు, సుమారు 10 వేలకు పైగా కూలీలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. సింగరాయకొండ నుంచి తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఉప్పు ఎగుమతి అవుతుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలం తప్ప మిగిలిన కాలాల్లో అనగా సుమారు 9 నెలల పాటు ఉప్పు సాగు చేస్తారు. ప్రతి సంవత్సరం ఎకరాకు 75 కేజీల బస్తాల ఉప్పు సుమారు వెయ్యి బస్తాలు ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రకారం ప్రతినెలా సుమారు 25 వేల టన్నుల వరకు ఉప్పు ఉత్పత్తి వస్తుంది. ఈ సంవత్సరం కేవలం సుమారు 650 బస్తాలే ఉత్పత్తి అయ్యాయని ఉప్పు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాణ్యతను బట్టి 100 కేజీ ల ఉప్పు ధర రూ.310 నుంచి రూ.400 ఉందన్నారు. ప్రస్తుతం పెరిగిన కూలీల ధరలతో వాతావరణ మార్పుల కారణంగా ఈ సంవత్సరం కష్టాలు తప్పని పరిస్థితి ఉందని ఉప్పు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన నాణ్యమైన ఉప్పు దిగుబడి

ప్రతి సంవత్సరం జనవరి నెల నుంచి ఉప్పు కొటారులను బాగు చేసుకుని ఫిబ్రవరి నెలాఖరుకు ఉప్పు ఉత్పత్తి ప్రారంభించి జూలై వరకు ఉప్పు ఉత్పత్తి చేస్తారు. తరువాత వాతావరణం అనుకూలతను బట్టి సెప్టెంబరు నెలాఖరు వరకు ఉప్పు ఉత్పత్తి అవుతుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచే అడపాదడపా వర్షాలు ప్రారంభమవటంతో ఉత్పత్తి ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగింది. దీనికి తోడు ఉప్పు ఉత్పత్తి బాగా వచ్చే సమయంలో వర్షాలు కురవటంతో ఉత్పత్తి ఆగి తిరిగి ప్రారంభమయ్యే సరికి మొదట్లో తక్కువ నాణ్యత ఉన్న ఉప్పు వచ్చింది. ఉప్పు దిగుబడి వచ్చే ప్రతిసారి వర్షాలు కురవటం ఉప్పు ఉత్పత్తి ఆగడం, మళ్లీ ఉత్పత్తి ప్రారంభం కావటం తరుచూ జరుగుతుండడంతో తక్కువ నాణ్యత ఉప్పు మాత్రమే తయారైందని రైతులు వాపోతున్నారు.



ఉప్పును నిల్వ చేసిన దృశ్యం

ట్యుటికోరన్ ఉప్పు సరఫరాలో వ్యాపారులు

జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా ఉప్పు నాణ్యత తగ్గటంతో ఉప్పు వ్యాపారులు తమిళనాడు రాష్ట్రం ట్యుటికోరన్ నుంచి తెచ్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ ప్రాంతంలో నాణ్యమైన ఉప్పు ఉత్పత్తి జరగటంతో వ్యాపారులు అక్కడ ఉప్పు కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు, పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. దీంతో జిల్లాలో ఉప్పు కొనుగోళ్లు మందగించాయని రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం వాతావరణ మార్పుల కారణంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నాణ్యమైన ఉప్పు దిగుబడి తగ్గటంతో ఈ సంవత్సరం ఖర్చులు వస్తాయే తప్ప లాభాలు వచ్చే అవకాశం లేదని ఉప్పు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాణ్యమైన ఉప్పు రావడం లేదు



2.5 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవటంతో ఉప్పు దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 75 కేజీల బస్తాలు సుమారు వెయ్యి బస్తాలు ఉత్పత్తి కావాల్సి ఉండగా ఈ సంవత్సరం సుమారు 650 బస్తాలు మాత్రమే ఉప్పు దిగుబడి వచ్చింది. దీనికి తోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నాణ్యమైన ఉప్పు ఉత్పత్తి జరగక ఉప్పునకు ఆశించిన ధర లభించలేదు.

– గౌరవరపు రాములు, ఉప్పురైతు, ఊళ్లపాలెం

ఉప్పు దిగుబడి తగ్గింది



నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని ఉప్పు సాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉన్నా నాణ్యమైన ఉప్పు తయారు కాకపోవటంతో తక్కువ ధరకు ఉప్పు అమ్ముకోవాల్సి వస్తోంది. అంతేకాక ఉప్పు దిగుబడి తగ్గింది.

– పురిణి శ్రీనివాసులరెడ్డి, ఉప్పు రైతు, ఊళ్లపాలెం

రాష్ట్రమంతటా అన్నదాత ఆక్రందనలే

- రైతులను మరచిన బాబు సర్కార్
- కూటమి పాలనలో మహిళలకు భద్రత కరువైంది
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున



మద్దులూరులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్నదాతకు ఆక్రందనలే మిగిలాయని, రైతులను కూటమి సర్కార్ మరిచిపోయిందని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని బొడ్డువానిపాలెం, మద్దులూరు గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండలపార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాతలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, రైతులకు ఎటువంటి కష్టం వచ్చినా కూటమి ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. ఎరువుల కొరత అధికంగా ఉందని, పండించిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదని ధ్వజమెత్తారు. కూటమి దౌర్జన్యాలకు చరమగీతం పాడాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ నాగేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, దుంపా ఎలమందరెడ్డి, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎస్ఎన్‌పాడు మహిళా అధ్యక్షురాలు సీతమ్మ, సర్పంచ్‌లు టీ వెంకటరెడ్డి, మైనం శైలజ అమరనాథ్, ఎంపీటీసీలు నల్లూరి రాధ భాస్కరరావు, కామేపల్లి సుబ్బయ్య, మాదాల వెంకటరావు, కే శ్రీమన్నారాయణ, తేళ్ల అనిల్, జంగాల కుమారి, ఎస్ సుబ్బారావు, పీ వెంకటరావు, ఎం రమణారెడ్డి, ఏ రమణారెడ్డి, కే దేవేందర్, కోటి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు స్వీయ నియంత్రణ అవసరం

- పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్



రైతులతో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్

మద్దిపాడు: పొగాకు రైతులకు స్వీయ నియంత్రణ అవసరమని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అన్నారు. మండలంలోని వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా పొగాకు పంట అత్యధికంగా బ్రెజిల్ తోపాటు జింబాబ్వే, టాంజానియా వంటి ఆఫ్రికా దేశాల్లో పండిస్తున్నారని అందువలన మన దేశంలో పొగాకు కొనుగోళ్లు తగ్గిపోతున్నాయని తెలిపారు. పైగా అక్కడ పొగాకు సాగు ఖర్చు తక్కువగా ఉండడం, పొగాకు పంటపై నిషేధం లేకపోవడం వలన ఆ దేశాలు అంతర్జాతీయ విపణిలో తక్కువ ధరతో పొగాకు పంటను అమ్ముతున్నాయని, దీంతో మన దేశానికి తీవ్రమైన పోటీ నెలకొందని అన్నారు. భారతదేశం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ తో ఒప్పందంలో భాగంగా పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు సంతనాలు చేయడం వలన దేశంలో పొగాకు పరిమితంగా పండించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అందుకే గత సంవత్సరం 170 మిలియన్ కేజీల పొగాకుకు అనుమతులు ఇచ్చామని, కానీ ఈ సంవత్సరం పొగాకు పంట నియంత్రించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్న ఉద్దేశంలో పొగాకు పంటను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరిమితంగా నాణ్యమైన పొగాకు సాగు చేస్తేనే అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు అమ్ముకోగలమని ఆయన రైతులకు హితవు పలికారు. అనంతరం ఆయన్ను రైతులు సన్మానించారు. ముందుగా ఆయన వేలం జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఫ్లోర్ నాయకులు అబ్బూరి శేషగిరిరావు, వరహాల చౌదరి, వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు ఆంజనేయులు, వెంకయ్య, ఫీల్డ్ ఆఫీసర్ హర్ష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తీరుపై సీఎండీ అసంతృప్తి

- స్వప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని ఆగ్రహం
- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో ఇవ్వడం లేదని మండిపాటు
- విద్యుత్ శాఖ జిల్లా అధికారులతో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి సమీక్ష



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్, ఎస్ఈలు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కింది స్థాయి నుంచి ఈఈ స్థాయి అధికారి వరకు కొందరు సంస్థ ప్రయోజనాల కోసం కాకుండా స్వప్రయోజనాల కోసం పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం ఇవ్వడంలో కాకి లెక్కలు చెబుతున్నారని కొందరు అధికారులపై మండిపడ్డారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పీ.పుల్లారెడ్డి స్థానిక విద్యుత్ భవన్‌లో మంగళవారం జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల ముఖ్య పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్య ఘర్ పురోగతి మీద, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరుపై సమీక్షించారు. విద్యుత్ శాఖ మీద ప్రజల అభిప్రాయం విషయంలో చాలా అసంతృప్తిగా ఉందని, అందుకు సంస్థలోని కొందరి అధికారుల పనితీరే ప్రధాన కారణమన్నారు. విద్యుత్ కలెక్షన్లు ఇచ్చే విషయంలో కూడా సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. బకాయిల విషయంలో అధికారులు సక్రమంగా వ్యవహరించటం లేదన్నారు. ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేయడం కోసం ప్రతి ఒక విద్యుత్ అధికారికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించారు. ఫీడర్ పెట్రోలింగ్ చేసి లోపాలను సరి చేయాలన్నారు. ప్రజలకు స్మార్ట్ మీటర్లు పట్ల ఉన్న అపోహలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లుతో పాటు ఒంగోలు ఈఈ హరిబాబు, డీఈఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పరిస్థితి మరింత ఘోరం



ప్రకాశం భవనం వద్ద నిరసన చేస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల

ఒంగోలు టౌన్: కూటమి పాలనలో ఉపాధ్యాయుల పరిస్థితి మరింత ఘోరంగా తయారైందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల చెప్పారు. ఏపీటీఎఫ్ పిలుపు మేరకు మంగళవారం ప్రకాశం భవనం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ పరీక్షలు, ప్రశ్న పత్రాలను అశాస్త్రీయ పద్ధతిలో ముద్రించి పంపిస్తున్నారని తెలిపారు. ఈ విధానం ఉపాధ్యాయుల్లో మరింత గందరగోళానికి దారి తీస్తోందని విమర్శించారు. ఇలాంటి ధోరణిని విడనాడాలని ప్రభుత్వానికి సూచించారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు ఎస్.గురునాథ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పద్ధతి మానుకోవాలని హితవుపలికారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి విజయ సారధి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. జిల్లా శాఖ కార్యదర్శి షేక్.నాయబ్ రసూల్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెమో 57ను తక్షణమే అమలు చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ అసెస్మెంట్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అన్నీ రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర నాయకురాలు షేక్.బషీరున్నీసా డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బి.శేషారావు, శేఖర్ రెడ్డి, టి.సుబ్బారావు, షేక్.ఖాదర్ బాషా, యేసుదాసు, వీరరాఘవులు, మౌలాలి, హరిబాబు, ఈశ్వరయ్య, సీహెచ్ మస్తాన్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


- ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శరత్ బాబు

ఒంగోలు సబర్బన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎన్‌జీజీఓ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఏపీఎన్‌జీజీఓ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కే శరత్‌బాబు అధ్యక్షతన ఒంగోలు ఎన్‌జీఓ హోమ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, రాష్ట్ర సంఘం తీసుకోబోయే అన్ని చర్యలకు కట్టుబడి పనిచేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా బాపట్ల జిల్లా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, 14 తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాపట్ల జిల్లాకు ప్రకాశం జిల్లా నుంచి వెళ్లిన చీరాల తాలూకా యూనిట్ అధ్యక్షుడు చింతా శేషుబాబు, కార్యదర్శి కొండవీటి శ్రీనివాస రావు, అద్దంకి తాలూకా యూనిట్ అధ్యక్షుడు జి కిరణ్ కుమార్, కార్యదర్శి టీ రమేష్ బాబు, పర్చూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు టీ సుధాకర్, కార్యదర్శి సీహెచ్ పూర్ణచంద్, మాజీ అధ్యక్షుడు కేపీ దాస్, మార్టూరు అధ్యక్షులు పీ చంద్ర శేఖర్, బాపట్ల జిల్లా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, కార్యదర్శి సుధాకర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కే శివ కుమార్, సహాధ్యక్షుడు యం వేంకటేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పీ మాధవి, జిల్లా ఉపాధ్యక్షులు తోట శ్రీనివాసు, పీ రామాంజనేయులు, బీ కృష్ణ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు షేక్ మోమిన్, పీ విజయ్ కుమార్, ఒంగోలు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి మంజీశ్, షేక్ మాగ్దుం షరీఫ్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ సీహెచ్ శిరీష పాల్గొన్నారు.

క్లుప్తంగా

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

- ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు హెచ్చరిక



బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలు టౌన్: బహిరంగంగా మద్యం తాగడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం లాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. మంగళవారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై లాఠీ ఝులిపించారు. మద్యం దుకాణాల సమీప ప్రాంతాలు, బస్టాండ్లు, పార్కులు, రోడ్లు, ఇతర ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజలను అసౌకర్యానికి గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. మద్యం దుకాణాల పరిసరాలు, ఖాళీ స్థలాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, పాత భవనాల్లో తనిఖీలు నిర్వహించారు. మందుబాబులు తమ ప్రవర్తనను మార్చుకోవాలని, లేకపోతే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే 112కు డయల్ చేయాలని సూచించారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితునికి రెండేళ్ల జైలు

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో నిందితునికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ స్థానిక ఎక్సయిజ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కోమలవల్లి మంగళవారం తీర్పునిచ్చారు. ఒంగోలుకు చెందిన ఎ.అంజలి నుంచి నిందితుడు ఎం.బాబు కుటుంబ అవసరాల నిమిత్తం రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కొద్ది కాలం తర్వాత తన అప్పు చెల్లించమని అంజలి ఒత్తిడి చేయడంతోకొంత మేర బాకీ చెల్లింపు నిమిత్తం రూ.3.50 లక్షలకు అందజేశాడు. ఆ చెక్కును బ్యాంకులో జమ చేయగా బౌన్స్ కావడంతో అంజలి కోర్టులో కేసు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితుడు బాబుకు రెండేళ్ల జైలు శిక్ష విధించారు. అదే విధంగా ఫిర్యాదికి రూ.6 లక్షలు చెల్లించాలని, జరిమానా కింద ప్రభుత్వానికి రూ.10 వేలు చెల్లించాలని నిందితుడిని జడ్జి ఆదేశించారు.

చోరీ కేసులో నిందితునికి రెండేళ్ల జైలు

ఒంగోలు: వాహనాలకు సంబంధించిన బ్యాటరీలు దొంగతనం చేసిన కేసులో నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ స్థానిక ఎక్సయిజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎ.కోమలవల్లి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వాహనాలకు సంబంధించి బ్యాటరీల చోరీ కేసులో సయ్యద్‌బాబు అనే వ్యక్తిని చీమకుర్తి పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి నిందితునిపై నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితునికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కె.శ్రావణ్‌కుమార్ వాదించారు.



జ్వరంతో బాధపడుతున్న బొమ్మాజి సంతోష్



డెంగీ జ్వరంతో బాధపడుతున్న అక్కా చెళ్లెల్లు యస్ ఫేబి, దీప్తి



డెంగీ, మలేరియా బారిన పడిన రచితకుమార్, సిరి



జ్వరంతో బాధపడుతున్న చిన్నారి లక్కు శ్రీయ



టైఫాయిడ్‌తో బాధపడుతున్న పి. యశస్విని

పెద్దనల్లకాల్వపై డెంగీ పంజా!

- గ్రామంలో 50 మందికిపైగా జ్వర బాధితులు
- డెంగీ, టైఫాయిడ్ పీడితులే అధికం
- ప్రాథమిక పాఠశాలలో సగానికిపైగా విద్యార్థులకు జ్వరాలే
- ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న తల్లిదండ్రులు
- గ్రామంలో మెడికల్ క్యాంపులు శూన్యం

కంభం: పల్లెల్లో జ్వరాల తీవ్రతకు కంభం మండలం పెద్దనల్లకాల్వ గ్రామంలోని తాజా పరిస్థితి అద్దం పడుతోంది. గ్రామంలో సుమారు 50 మందికి పైగా చిన్నారులు డెంగీ, టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. వీరంతా పదేళ్లలోపు వారే. గ్రామంలోని ఎస్సీ కాలనీలో అధికంగా జ్వరాలు ఉండగా కొన్ని ఇళ్లలో ఇద్దరు చొప్పున డెంగీ, ఇతర జ్వరాలతో బాధపడుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు

జ్వరాలు ఇంతలా విజృంభిస్తున్నా వైద్య శిబిరం ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. పిల్లలకు డెంగీ లక్షణాలు ఉండటంతో గిద్దలూరు, కంభం, మార్కాపురం పట్టణాలలోని ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. కంభం పట్టణంలోని కొందరు ఆర్‌ఎంపీలు స్థానిక ల్యాబ్‌లలో రక్త పరీక్షలు చేయించి, డెంగీ ఉన్నట్లు వారే నిర్ధారించి చికిత్స పేరుతో అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పాఠశాల సగం ఖాళీ..

గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల్లో సగానికి పైగా జ్వరాల బారిన పడ్డారు. ఇప్పుడిప్పుడే కొందరు చికిత్స చేయించుకొని పాఠశాలకు వస్తున్నారు. పాఠశాల ముందు ఉన్న డ్రైనేజీ అధ్వానంగా తయారై, దోమలు విజృంభిస్తుండటంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇటీవల కాలువ శుభ్రం చేసినప్పటికీ అప్పటికే జ్వరాలు ప్రబలిపోయాయి. గ్రామంలో గృహాల మధ్య చిల్లచెట్లు అధికంగా ఉండటం, మురుగు సక్రమంగా పోకపోవడం, పశువులు ఎక్కువగా ఉండటంతో పరిసరాల్లో దోమల ఉధృతి పెరుగుతోంది.



గృహాల మధ్య నిలిచిన మురుగు

దోమల బెడద ఎక్కువైంది



మా ఊర్లో ఇళ్ల మధ్య పిచ్చి చెట్లు దట్టంగా పెరిగిపోయాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమల బెడద ఎక్కువైపోయింది. దోమలు కుట్టడం వల్ల పసి పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇళ్లలో వాడుక నీళ్లు, అలాగే వర్షం నీరు బయటకు పోయేందుకు కాలువలు సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన వస్తోంది. వైద్య శిబిరం పెడితే పేదోళ్లు, ముసలోళ్లకు మేలు జరుగుతుంది.

– బొమ్మాజి జ్ఞానమ్మ, గ్రామస్తురాలు

డెంగీ బారిన పడుతున్న చిన్నారులు

- గ్రామానికి చెందిన బొమ్మాజి సంతోష్ (9 సంవత్సరాలు) వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. రోజూ సెలైన్ ఎక్కిస్తున్నారని, టైఫాయిడ్ అని వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు చెబుతున్నారు.
- ఎస్సీ కాలనీలో ఉంటున్న అక్కా చెల్లెళ్లు ఎస్.ఫెబీ, దీప్తి డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. తొలుత కంభంలో వైద్యుడికి చూపించగా తగ్గకపోవడంతో మార్కాపురంలో చికిత్స అందించారు.
- ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న అక్కా తమ్ముడైన ఎల్ సిరి, రజిత కుమార్ మలేరియా, డెంగీ జ్వరంలో బాధపడుతున్నారు. కంభంలో వారం రోజులు చూపించినా తగ్గకపోవడంతో గిద్దలూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.
- లక్కు శ్రీయ అనే మూడేళ్ల చిన్నారి జ్వరంతో బాధపడుతుండగా మంగళవారం వైద్యశాలకు తీసుకెళ్లారు.
- పి.యశస్విని ఆరు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ కంభంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది.
- ఎల్.సంధ్య శ్రీ వారం రోజుల క్రితం జ్వరం రాగా కంభంలో చూపించారు. డెంగీ అని చెప్పడంతో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు.
- కనిగిరి ప్రవీణ, కె.అరవింద్, దూదేకుల ఖాశింబి డెంగీ జ్వరంతో మార్కాపురంలో చికిత్స పొందుతున్నారు.
- వీరితో పాటు దూదేకుల షరీఫ రాహుల్, ప్రణవి, రామలింగేశ్వర్, షారుక్, సృజన, సంతోష్, ఇంకా పలువురు పిల్లలు జ్వరాల బారిన పడ్డారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన సిద్దయ్య

గిద్దలూరు రూరల్: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గిద్దలూరు మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన బోగోలు సిద్దయ్య(65) పెట్రోల్ బంకులో తన బైక్‌లో పెట్రోల్ పోయించుకుని వెళ్తున్న సమయంలో పోరుమామిళ్ల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సిద్దయ్యను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు మండలం మైనంపాడు లో సోమవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బూచిరాజు శ్రీనివాసరావు (56) మృతి చెందారు. వివరాలు.. శ్రీనివాసరావు తన మోటార్ సైకిల్‌పై మైనంపాడులోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి ఇంధనం నింపుకొని తిరిగి ఇంటికి బయలుదేరారు. ముందు వైపు వాహనాన్ని తొలగేసే క్రమంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన శ్రీనివాసరావును ఒంగోలులోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆయన మృతి చెందారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ ఉదయ్ కుమార్ తెలిపారు.

నల్లబర్లీ పొగాకు ఎందుకు కొనడం లేదు?

- ధ్వజమెత్తిన బర్లీ పొగాకు రైతులు
- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతుల ఆగ్రహం



వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

నాగులుప్పలపాడు: నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయడం లేదని బర్లీ సాగు చేసిన రైతులు, రైతు సంఘం నాయకులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పెద్ద ఎత్తున గొడవకు దిగి ఆందోళన చేశారు. నల్లబర్లీ సాగు చేసిన రైతులను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని, చివరి పొగాకు వరకు కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను మధ్యలోనే ఎందుకు ఆపేశారని నిలదీశారు. మండలంలోని ఉప్పుగుండూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన రైతులకు పలు సూచనలు చేస్తుండగా ప్రభుత్వ వైఖరిపై రైతులు గళమెత్తారు. రైతుల పట్ల పక్షపాతం చూపిస్తూ రైతులకు అందజేసిన సీరియల్‌లో కాకుండా పలుకుబడి ఉన్న రైతుల వద్ద మాత్రమే నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. దీనికి స్పందించిన జేడీ శ్రీనివాసరావు స్పందిస్తూ ఇప్పటికే రైతుల వద్ద నుంచి కొంత మేరకు నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేశారని, ఇంకా 500 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఈ విషయం ప్రభుత్వం పరిశీలనలో ఉందని, త్వరలో నూతన కలెక్టర్‌ను కలిసి మరొకసారి పొగాకు రైతుల సమస్యలను వివరించి మిగిలిన పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అయితే మీరు కొనేలోపు మా దగ్గర ఉన్న పొగాకు నాణ్యత కోల్పోవడం, జాగ్రత్త చేయడానికి తగినంత చోటు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని రైతులు జేడీ దృష్టికి తీసుకొచ్చారు. జీవో నంబరు 740 ప్రకారం జిల్లా లో ఏ ఒక్కరూ నల్ల బర్లీ పొగాకు సాగుచేయవద్దని తెల్లబర్లీ పొగాకును కూడా సంబంధిత కంపెనీల వద్ద నుంచి రైతులు అగ్రిమెంట్ తీసుకొని సాగు చేసుకోవాలని జేడీ రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మొక్కజొన్న పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు, వెంకట్రావు పాల్గొన్నారు.

గాలి తీవ్రతకు తెగి పడిన విద్యుత్ తీగలు

- జాతీయ రహదారిపై తప్పిన పెను ప్రమాదం

నాగులుప్పలపాడు: జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు తీవ్రమైన గాలులకు తెగిపడిన ఘటన నాగులుప్పలపాడులో మంగళవారం జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయాల వద్ద 216 జాతీయ రహదారికి ఇరువైపులా ఎత్తుగా వాహనాలు తగలకుండా ఉండేందుకు విద్యుత్ శాఖాధికారులు ఎత్తైన టవర్లతో 11 కేవీ విద్యుత్ తీగలు ఇరువైపులా లాగారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ఒక్కసారిగా 216 జాతీయ రహదారిపై పడిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్రంగా భయపడిపోయి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపేశారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే సరఫరా నిలిపేసి తెగిపడిన విద్యుత్ లైన్‌ను సరిచేసి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా ఏర్పాటు చేశారు. గాలి వీచి తీగలు తెగిన సమయంలో రోడ్డుపై ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా జరిగిన నష్టాన్ని గుర్తించి విద్యుత్ తీగల కింద జాలీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యుత్ వైరు తెగి పడటంతో ఆగిన వాహనాలు

భార్యను కట్టేసి చిత్రవధ!

- కాళ్లతో తన్నుతూ.. బెల్ట్‌తో మోదుతూ పైశాచికం
- మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వకపోవడమే కారణం
- తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో ఘటన



భార్యను కట్టేసి కొడుతున్న బాలాజీ

తర్లుపాడు: ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యను కట్టేసి తీవ్రంగా హింసించి చంపేందుకు యత్నించడంతో స్థానికులు అడ్డుకుని ఆమెను కాపాడిన సంఘటన ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కలుజువ్వలపాడు చెందిన గురునాథం బాలాజీకి భాగ్యలక్ష్మితో సుమారు 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్నారు. మద్యానికి బానిసైన బాలాజీ భార్యను తరచూ తీవ్రంగా హింసించేవాడు. ఈ క్రమంలో భార్యా పిల్లలను వదిలేసి వేరే మహిళతో హైదరాబాదులో ఉంటున్నాడు. శనివారం రాత్రి కలుజువ్వలపాడు గ్రామానికి వచ్చిన బాలాజీ.. స్థానికంగా ఉండే బేకరీలో పని ముగించుకొని ఇంటికి వస్తున్న భార్య భాగ్యలక్ష్మిని అటకాయించాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని కోరగా అందుకు ఆమె నిరాకరించడంతో బాలాజీలోని రాక్షసుడు నిద్ర లేచాడు. తన అక్క రమణ, మేనల్లుడు విష్ణు, బాలాజీ మరో భార్య కలిసి భాగ్యలక్ష్మిని బైకుపై బలవంతంగా ఎక్కించుకొని.. అక్క ఇంటికి తీసుకువెళ్లి తాళ్లతో నిర్బంధించాడు. రాత్రి తొమ్మిది గంటల నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకు చిత్రహింసలకు గురిచేసి విడిచిపెట్టారు. మళ్లీ సోమవారం రాత్రి చిత్రహింసలు పెట్టేందుకు బాలాజీ యత్నించగా ఆమె తప్పించుకొని ఎస్సీ కాలనీలోకి పరుగెత్తింది. స్థానిక చర్చి వద్ద ఉన్న కొందరు యువకులు బాలాజీని, అతని మేనల్లుడిని అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం జరిగిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక యువకులు 112కు ఫోన్ చేశారు. రాత్రి 11 గంటల సమయంలో వచ్చిన పోలీసులు బాధిత మహిళను ఫొటో తీసుకుని బాలాజీ మేనల్లుడు విష్ణును బైక్‌పై ఎక్కించుకొని కొంత దూరం తీసుకెళ్లి మధ్యలో వదిలేసినట్లు సమాచారం. శనివారం చేసిన చిత్రహింసను బాలాజీ రెండో భార్య వీడియో తీయగా అది మంగళవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. కాగా మహిళను చిత్రహింసలకు గురిచేయడంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై విలేకరులతో తెలిపారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో వీడియో ప్రచురితం కావడంతో దర్శి సీఐ, తర్లపాడు ఎస్సై కలుజువ్వలపాడు గ్రామానికి చేరుకున్నారు. బాధిత మహిళను వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

తెరుచుకోని కళ్లు.. నిర్లక్ష్యం నూరుపాళ్లు!

- సంతనూతలపాడు–పేర్నమిట్ట మధ్య కర్నూలు రోడ్డుపై ప్రమాదకర పరిస్థితులు
- గోతులు ఏర్పడినా, చప్టాలు కూలే స్థితిలో ఉన్నా స్పందించని ఆర్‌అండ్‌బీ అధికారులు



ఒంగోలు-సంతనూతలపాడు మధ్య కర్నూల్ రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

చీమకుర్తి: కర్నూలు రోడ్డులో పరిస్థితులు ప్రమాదాలకు దారితీసేలా ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. సంతనూతలపాడు సమీపంలోని కర్నూల్ రోడ్డుపై చప్టాకు భారీ గొయ్యి పడింది. పోలీసులు తాత్కాలికంగా బారికేడ్ ఏర్పాటు చేసి ఇసుక సంచులను ఉంచారు. ఈ మార్గంలో వందలాది గ్రానైట్ వాహనాలు, కంకర టిప్పర్లు, శ్లాబుల ట్రాలీలు తిరుగుతుంటాయి. వాటితో పాటు ఇతర లారీలు, కార్లు, బైకులు, ఆర్టీసీ బస్సులు సరేసరి. ఇంత రద్దీగా ఉండే కర్నూలు రోడ్డుపై గొయ్యి ఏర్పడితే ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి మూడు రోజులుగా కనీస స్పందన కరువైంది. ఇదే వంతనపై కొన్నేళ్ల క్రితం ఇలాగే పెద్ద గొయ్యి ఏర్పడింది. అప్పట్లో ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన వంతెన నిర్మించాలనే ఉద్దేశంతో రోడ్డుకు దక్షిణం వైపు తాత్కాలికంగా మట్టి రోడ్డు కూడా నిర్మించారు. ఇంతలో ఏమైందో ఏమో వంతెన కింద గొయ్యి పడ్డ ప్రదేశంలో తాత్కాలిక ఏర్పాటు చేసి గొయ్యిపైన తారు రోడ్డు వేసి చేతులు దులుపుకొన్నారు. ఇదిలా ఉండగా ట్రిపుల్ ఐటీ కాలేజీ సమీపంలో కల్వర్టు రెయిలింగ్ విరిగిపడింది. కల్వర్ట్‌పై గుంతను మట్టితో పూడ్చేయడంతో కాలేజీ నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుకు ఒక వైపు నిల్వ చేరి మడుగును తలపిస్తోంది. ఇదే ప్రాంతంలో నాలుగైదు రోజుల క్రితం ఒక గ్రానైట్ లారీ రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. తరచూ ఇక్కడ సంభవించే ప్రమాదాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు మొద్దునిద్ర వీడాలని వాహనదారులు, ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.



ట్రిపుల్ ఐటీ కాలేజీ వద్ద ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్



కర్నూల్‌రోడ్డులో కాలువలోకి జారిపడిన కల్వర్టు రెయిలింగ్

వక్ఫ్ చట్టంపై సుప్రీం తీర్పు కూటమి సర్కారుకు చెంపపెట్టు

మార్కాపురం టౌన్: కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లు సవరణ చట్టంపై సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ముస్లింల కోసం నాటి దాతలు తమ ఆస్తులను వక్ఫ్ బోర్డుకు ఇచ్చారని, అలాంటి ఆస్తులు అమ్మినా, కొన్నా నేరమేనన్నారు. అలాంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేసిందని, సవరణ బిల్లుపై వైఎస్సార్ సీపీ పార్లమెంటులో పోరాటంతో పాటు సుప్రీం కోర్టులో సైతం సవాలు చేసిందని గుర్తు చేశారు. మోదీ సర్కార్ ఈ వక్ఫ్ బిల్లుకు చట్టం తెస్తే టీడీపీ, బీజేపీ, జనసేన గుడ్డిగా మద్దతు ఇచ్చాయని విమర్శించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

యర్రగొండపాలెం: వరకట్నం కోసం భర్త పెట్టే బాధలు తాళలేక వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై పి.చౌడయ్య కథనం మేరకు.. ఎలకపాటి లిడియాకిరణ్(27) అదనంగా కట్నం తీసుకురాలేదని ఆమె భర్త ఎలకపాటి సిమోను నిత్యం వేధిస్తున్నాడు. ఆ బాధలు తట్టుకోలేక ఆమె ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మ చేసుకుంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. లిడియా అన్న వినోద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ బందోబస్తుతో యూరియా పంపిణీ



కుంకలమర్రులో ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఏఓ

కుంకలమర్రు(కారంచేడు): రైతులకు అవసరమైన ఎరువులను పోలీస్ బందోబస్తు మధ్య సరఫరా చేస్తున్నారు. ఒక్కో రైతుకు కేవలం రెండు యూరియా బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తుండటంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో అన్నదాతలు రోడ్డుమీదకు వచ్చారు. సొసైటీల వద్ద పడుగాపులు పడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో వ్యవసాయాధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతో మంగళవారం మండలంలోని కుంకలమర్రు గ్రామంలో 299 మంది రైతులకు 640 బస్తాల యూరియా సరఫరా చేశామని తహసీల్దార్ జి. నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎం. నాగరాజు, పోలీస్ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.